# జూబ్లీహిల్స్ డివిజన్‌లో బీజేపీకి షాక్

- బీజేవైఎం అధ్యక్షుడితో సహా పలువురు బీఆర్ఎస్‌లో చేరిక
- పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే దానం నాగేందర్



బీఆర్ఎస్‌లో చేరిన జూబ్లీహిల్స్ డివిజన్ బీజేవైఎం అధ్యక్షుడు చేతన్‌కుమార్‌కు పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్

బంజారాహిల్స్/ఖైరతాబాద్, నవంబర్ 20 : ఖైరతాబాద్ నియోజకవర్గంలోని జూబ్లీహిల్స్ డివిజన్‌లో బీజేపీకి మరోషాక్ తగిలింది. బండారు బాల్‌రెడ్డినగర్‌కు చెందిన బీజేవైఎం డివిజన్ అధ్యక్షుడు వంగర చేతన్‌కుమార్ అలియాస్ నానితోపాటు పెద్ద సంఖ్యలో బీజేపీ కార్యకర్తలు పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. సోమవారం ఫిలింనగర్‌లో ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దానం నాగేందర్ సమక్షంలో వారంతా బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఉదయ్‌కిరణ్, జోసెఫ్, చెన్నకేశవులు, నరేశ్, అనిల్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. ఇప్పటికే పలు డివిజనల్లో వందలాది మంది బీజేపీ కార్యకర్తలు చేరారని, రానున్న ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గంలో మరోసారి బీఆర్ఎస్ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్, నాయకులు మామిడి నర్సింగరావు. నక్కా రాము, కాటూరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

**బీసీ బిడ్డను గెలిపించుకుందాం..**

రాజకీయ అనుభవం కలిగిన బీసీ బిడ్డ దానం నాగేందర్‌ను మరోసారి ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిపించుకుని సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇద్దామని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదలకు ఎంతో లాభం కలిగిందని, రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే మరిన్ని సంక్షేమ పథకాలు వస్తాయని, కాంగ్రెస్ పార్టీని నమ్మితే కష్టాలు తప్పవని హెచ్చరించారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో సుమారు 60శాతం బీసీ ఓటర్లే ఉండటంతో మరోసారి దానం నాగేందర్‌కు టికెట్ ఇచ్చిన సీఎం కేసీఆర్ బీసీలపై ఉన్న ప్రేమను చాటుకున్నారని, దానం నాగేందర్‌ను గెలిపించి బీసీల సత్తా చూపుదామంటూ పేర్కొన్నారు.



ఫిలింనగర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న దానం నాగేందర్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

**కారు గుర్తుకు ఓటు వేయండి.. అభివృద్ధికి పట్టం కట్టండి**

ఖైరతాబాద్ : బంగారు తెలంగాణకు బాటలు వేసిన తెలంగాణ ప్రభుత్వాన్ని మూడోసారి గెలిపించుకోవాలని, కారు గుర్తుకు ఓటు వేసి అభివృద్ధికి పట్టం కట్టాలని కోరుతూ హైదరాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కె.ప్రసన్న రామ్మూర్తి సోమవారం సోమాజిగూడ డివిజన్ పరిధిలో తెలంగాణ ఉద్యమకారులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని, ఖైరతాబాద్‌లో ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓట్లరకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల మ్యానిఫెస్టోలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాంచందర్, శ్రీనివాస్, పాశం వెంకటేశ్, షేక్ అహ్మద్, గుండు నరసింహ ముదిరాజ్, రావుల విజయ్, సారంగపాణి, సీహెచ్ జానీ నాయక్, ఉమా, విజయలక్ష్మి, సుజాత రెడ్డి, నిశాంత్, సురేశ్, భిక్షపతి, భాస్కర్ గౌడ్, ఆంజనేయులు ముదిరాజ్, ప్రకాశ్, సాగర్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.



సోమాజిగూడ డివిజన్ పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ప్రసన్న రామ్మూర్తి, తెలంగాణ ఉద్యమకారులు



బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపించాలని జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ బస్తీల్లో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఖైరతాబాద్ బీఆర్ఎస్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి

## బీఆర్ఎస్‌తోనే మరింత ప్రగతి సాధ్యం


హిమాయత్‌నగర్, నవంబర్ 20 : స్వార్థ ప్రయోజనాల కోసం రాజకీయాలు చేసే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని హిమాయత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు జి.రామన్‌గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని పలు అపార్ట్‌మెంట్లలోని ప్రజలను కలిసి ఈనెల 30న జరిగే పోలింగ్‌లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజల్లో ఆదరణ చూసి ఓర్వలేక విపక్ష నాయకులు చేసే ఆరోపణలు చేయడం తగదన్నారు. ఆసరాతో వృద్ధులు, వితంతువులు ఒంటరి మహిళలకు పింఛన్లు అందజేసి వారిలో సీఎం కేసీఆర్ ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహేశ్, జైస్వాల్, మల్లేశ్, శారద తదితరులు పాల్గొన్నారు.



హిమాయత్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న రామన్‌గౌడ్

## కారు 'గెలుపు' కోసం కలిసికట్టుగా..

బంజారాహిల్స్, నవంబర్ 20 : గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఆశించి భంగపడిన నేత మామిడి నర్సింగరావు, పార్టీ టికెట్‌పై పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయిన మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ, బీజేపీ తరపున ఎన్నికల్లో విజయం సాధించి బీఆర్ఎస్‌లో చేరిన ప్రస్తుత కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్, ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ విజయం కోసం వారంతా ఒక్కతాటిపైకి వచ్చి ఫిలింనగర్ బస్తీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తుండటం కార్యకర్తల్లో సంతోషాన్ని నింపింది. అభిప్రాయబేధాలు ఎన్ని ఉన్నా తామందరి లక్ష్యం మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చేయాలన్నదే అని, అందుకే కలిసికట్టుగా ప్రచారం చేస్తున్నామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో జూబ్లీహిల్స్ డివిజన్‌లో బీఆర్ఎస్‌కు అత్యధిక మెజార్టీ వచ్చేలా చూస్తామని ధీమా వ్యక్తం చేశారు.



ఫిలింనగర్ బస్తీల్లో ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్, మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ, మామిడి నర్సింగరావు



నారాయణగూడలో స్వచ్ఛ ఆటోలకు స్టిక్కర్లను అంటిస్తున్న జ్యోతిబాయి

## ఓటు హక్కును వినియోగించుకోవాలి

హిమాయత్‌నగర్, నవంబర్ 20 :రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని అంబర్‌పేట సర్కిల్ –16 ఏఎంహెచ్‌వో డాక్టర్ జ్యోతిబాయి అన్నారు. సోమవారం నారాయణగూడలో 'నేను ఓటు వేస్తాను' అనే నినాదంతో జీహెచ్ఎంసీ ముద్రించిన స్టిక్కర్లను స్వచ్ఛ ఆటోలకు అతికించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ఎంతో విలువైందో.. బాధ్యతాయుతంగా ప్రజలు ఓటును సద్వినియోగం చేసుకునే విధంగా వివిధ రూపాల్లో ప్రచారం చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ పారిశుధ్య విభాగం ఎస్ఎస్ తిరుపతి నాయక్, ఎస్ఎఫ్ఏలు శ్రీనివాస్, సోమయ్య, మధు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంబీసీలకు చట్టసభల్లో అవకాశం కల్పించాలి



అభివాదం చేస్తున్న నర్సింహ సాగర్, వెంకట్ తదితరులు

ఖైరతాబాద్, నవంబర్ 20 : బీసీలలో రాజకీయ ప్రాతినిధ్యం లేని ఎంబీసీ, డీఎన్‌టీలకు చట్ట సభల్లో అవకాశాలు కల్పించాలని ఎంబీసీ, డీఎన్‌టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బంగారు నర్సింహ సాగర్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 75 ఏండ్లలో ఎంబీసీలకు ఏ పార్టీ కూడా సరైన ప్రాతినిధ్యం కల్పించలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ఎన్నికల తర్వాత రాబోవు ప్రభుత్వం తమకు జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించాలని, డిగ్రీ, పీజీ, మెడికల్, ఇంజినీరింగ్ కోర్సుల్లో రిజర్వేషన్లు, ఎమ్మెల్సీ, నామినేటెడ్ పోస్టులు, వారి సంక్షేమానికి ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో బెక్కం వెంకట్, కోల శ్రీనివాస్, ఎత్తరి అంతయ్య, సత్తార్ సాహెబ్, మినగ గోపీ, నరసింహ, మురళీకృష్ణ, నరేందర్ వంశరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఖైరతాబాద్ నియోజకవర్గంలో 258 పోలింగ్ స్టేషన్లు

**పెరిగిన ఓటర్లకు అనుగుణంగా13 కొత్త పోలింగ్ స్టేషన్లు**

బంజారాహిల్స్, నవంబర్ 20 : ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య భారీగా పెరగడంతో పోలింగ్ స్టేషన్ల సంఖ్య పెరిగింది. ప్రస్తుతం నియోజకవర్గంలో 245 పోలింగ్ స్టేషన్లు ఉండగా.. అదనంగా 13 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. దీంతో నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్ల సంఖ్య 258కి పెరిగింది. కొత్తగా ఏర్పాటైన పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన వివరాలను, ఆయా పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన ఓటర్ జాబితాలను రూపొందించి రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు సోమవారం అందజేశారు. నియోజకవర్గంలో మొత్తం 2,96,014 మంది ఓటర్లు ఉన్నారు. పెరిగిన పోలింగ్ స్టేషన్లకు అనుగుణంగా ఈవీఎం యంత్రాలను, వీవీ ప్యాట్స్ పరికరాలను సిద్ధం చేశారు.



సోమాజిగూడలో స్థానిక ఓటర్లతో సమావేశమై తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తున్న కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు వనం సంగీత యాదవ్, బీఆర్ఎస్ నాయకులు వనం శ్రీనివాస్ యాదవ్ – ఖైరతాబాద్